# సీటు మహిమ

–డాక్టర్ ఎమ్.సుగుణరావు

ముక్కు తుడుచుకుంటూ ఆఫీసులోకి ప్రవేశించాడు చిదంబరం.

''ఇవాళ స్కోరెంత చేస్తాడో?'' టైపిస్టు పక్కసీటతనితో అంటున్న మాటలు విని భారంగా నిట్టూర్చాడు.

''నిన్న సెంచరీ చేసేసాడు. ఇవాళేం చేస్తాడో?'' అంటున్నాడు.

ఆ మాటలు చిదంబరానికి శూలాల్లా తగిలాయి.

''అన్నట్లు నిన్న మన బాస్ ఇంటర్‌కమ్‌లో పిలిచి అడిగాడు చిదంబరం స్కోరు వివరాలు. టెస్టు మ్యాచులు, వన్‌డే సీరీసులూ లేకపోయినా అతగాడి స్కోరుతో కాలక్షేపం అయిపోతోంది.''

చిదంబరం భరించలేకపోయాడు ఆ మాటలు. ఇంతలో వాయువేగంతో అతడి ముక్కుపుటాల్లోంచి వచ్చేసింది. ఎవరో 'ఒకటి' అని లెక్కపెడుతున్నారు.

ఇక లాభంలేదు. ఇక్కడ్నించి పారిపోవాలి. ఈ తుమ్ముల సంగతి తేల్చేయాలి అనుకున్నాడు. వెంటనే లీవ్‌లెటర్ రాసి ''అప్పన్నా'' అని అటెండర్‌ను పిలిచాడు. అతను రాగానే ఆ ఉత్తరం అతని కిచ్చి ''ఆఫీసరుగారు రాగానే ఇవ్వు'' అంటూ బయటకు నడిచాడు.

''మీరెళ్ళిపోతే మాకు కాలక్షేపం ఎలా?'' ఎవరో అంటున్నారు.

''పోనీలెండి. పీడ విరగడయింది. హాయిగా కునుకు తీద్దామంటే ఈ తుమ్ముల నేపథ్యం ఒకటి'' ఆఫీసులో నిద్రపోయే కుంభకర్ణుడి తమ్ముడు అంటున్నాడు. వారి మాటలు వినకుండా 'బ్రతుకు జీవుడా' అనుకుంటూ బయటపడ్డాడు. రోడ్డుమీద నడుస్తున్నాడు. 'తన జీవితం ఇలా అయిపోవాలని రాసుందా? దీనికి కారణం ఏమిటో?' అలా ఆలోచిస్తూ నడుస్తున్నాడు. రెండునెలల నుంచీ తుమ్ములు. జలుబుకు మందువేస్తే వారంరోజుల్లో, వెయ్యకపోతే ఏడురోజుల్లో తగ్గిపోతుందని ఎవరో చెప్పారు. అందుకే ఏ మందూ వాడకుండా ఉండిపోయాడు. ఆ తరువాత మందులషాపు వాళ్లిచ్చినవి వాడాడు. అయినా ఫలితంలేదు.

''నమస్కారం సార్'' అన్న పిలుపుతో తలెత్తాడు.

''మీ మేలు మరచిపోలేను సార్'' ఎదురుగా తమ కాలనీకి రాత్రిళ్ళు కాపలాకాసే వాచ్‌మెన్.

''దేనికి?'' అన్నాడు చిదంబరం అనుమానంగా.

''ఈమధ్య రాత్రిళ్ళు హాయిగా నిద్రపోతున్నాను. దొంగలు రావడంలేదు. మీ తుమ్ములకు భయపడి ఎక్కడి దొంగలు అక్కడనే గప్‌చిప్'' అంటూ మరోసారి నమస్కారం చేసి వెళ్లిపోయాడు.

చిదంబరానికి బతుకు రోతగా అనిపించింది 'ఆఫీసులోనూ, బైటా ఇదే గోల' అనుకున్నాడు.

నడుస్తున్నవాడల్లా ఎదురుగా కనిపించిన బోర్డు చూసి ఆగిపోయాడు.

'గొంతు, ముక్కు, చెవి నిపుణుడు' అంటూ రాసుంది.

''బావుంది. ఈయన్ను కలిస్తే మంచి వైద్యం దొరుకుతుందేమో?' అనుకుంటూ ఆ క్లినిక్‌లోకి ప్రవేశించాడు. డాక్టర్ సీరియస్‌గా కనిపించాడు. నవ్వుతూ నమస్కారం చేసినా ఆయన ముభావంగా పూరుకున్నాడు. భయపడుతూ ఆయన ఎదురుగా స్టూలు మీద కూర్చున్నాడు.

''సార్! మరి... నెలరోజులనుంచీ...'' అన్నాడు.

చిదంబరం మాటలు పూర్తిగా వినకుండా బిపి ఆపరేటర్ తీసి స్టెతస్కోప్ గుండెలమీద వుంచాడు.

''మరండీ...'' చిదంబరం చెప్పబోయాడు.

''గాలి బాగా పీల్చి వదలండి'' అన్నాడు డాక్టర్.

''అదికాదు సార్'' అనబోయాడు. ఆయన చిదంబరం మాటలు పట్టించుకోకుండా ''ఆ బల్లమీద పడుకోండి'' అన్నాడు.

చిదంబరానికేమీ అర్థంకాలేదు.

''బహుశా ముక్కుకీ, మిగతా అవయవాలకి కనెక్షన్ ఉందేమో! సరే కానీ...'' అనుకున్నాడు.

ఆయన తన లెటర్ పాడ్ తీసి ''స్కానింగ్, యూరిన్, బ్లడ్‌టెస్టులు, ఎక్స్‌రే తీయించండి. ఈ వీధి చివర లేబ్‌లో చేయించి రిపోర్టులతో రేపు రండి. వందిచ్చి వెళ్లండి'' అన్నాడు.

చిదంబరం జేబులోంచి వందనోటు తీసి ఆయన కిచ్చి బయటకు నడిచాడు.

• • •

తరువాతి రోజు ఆఫీసుకు సెలవుపెట్టి టెస్టులన్నీ చేయించుకుని సాయంత్రం రిపోర్టులు తీసుకుని క్లినిక్‌కు బయలుదేరాడు. కన్సల్టింగ్ రూములో డాక్టర్ సీటులో వున్న వ్యక్తిని చూసి ఆశ్చర్యపోయాడు. నిన్న తనను చూసిన డాక్టర్ కాదు.

''సార్ నిన్న వేరే డాక్టర్ చూసారు. రిపోర్టులు తెమ్మన్నారు'' అన్నాడు అవన్నీ టేబుల్‌మీద పెడుతూ.

ఆయన నవ్వి ''ఏమిటీ ప్రాబ్లం!'' అన్నాడు.

ఆ ప్రశ్నకు సమాధానం చెప్పబోయేసరికి తుమ్మొచ్చింది చిదంబరానికి.

''మీ కేసు అర్థమైంది. అయితే మీరు పొరపాటు పడ్డారు'' అన్నాడు డాక్టర్ నవ్వుతూ చిదంబరం తుమ్ము పూర్తి చేసిన తరువాత.

''అంటే?'' అర్థంకాక డాక్టరును అడిగాడు చిదంబరం.

''నిన్న మిమ్మల్ని చూసినాయన మూత్రపిండాల స్పెషలిస్టు. ఆ బోర్డు చూడండి'' అన్నాడు డాక్టర్ గోడమీద నేమ్‌ప్లేట్ చూపిస్తూ.

ఆ నేమ్‌ప్లేట్ మీద 'డాక్టర్ దుర్వాస్, కిడ్నీ స్పెషలిస్టు' అని వుంది.

''మరయితే బయట బోర్డు?'' అంటూ నసిగాడు చిదంబరం.

''బయట బోర్డు నాదే. నా క్లినిక్ సాయంత్రం. ఆయన ఉదయం చూస్తారు. ఇద్దరిదీ ఒకటే రూము. అందుకే మీరు పొరపాటుపడ్డారు'' అన్నాడు డాక్టరు.

ఆ మాటలకు చిదంబరానికి కళ్ళనీళ్ళ పర్యంతం అయింది. ఆయన చిదంబరం గొంతు, ముక్కు పరీక్షించి ''ఎక్స్‌రే, రక్తపరీక్ష మళ్ళీ చేయించండి. మీరు నిన్న తీయించుకున్న చోట కాదు. ఆ పక్కవీధిలో చివర వుంది. అక్కడ చేయించి రిపోర్టు తీసుకుని రేపు రండి. వందిచ్చి వెళ్ళండి'' అన్నాడు.

చిదంబరం ఆ మాటలకు కుమిలిపోతూ నీరసంగా బయటకు నడిచాడు.

• • •

తరువాతి రోజు సాయంత్రం ఆఫీసు అయింతర్వాత రెండోసారి చేయించుకున్న పరీక్షల రిపోర్టులతో క్లినిక్‌కు చేరుకున్నాడు. రిపోర్టులు చూసిన డాక్టరు ''మీకు ఏ సమస్యాలేదు. కేవలం ఎలర్జీవల్లే తుమ్ములొస్తున్నాయి. అది కలిగించే దుమ్ము, ధూళి వంటి వాటికి దూరంగా వుండండి'' అన్నాడు.

ఆ మాటలకు చిదంబరం ఆశ్చర్యపోయాడు. తనకు సరిగ్గా నెలనుంచి తుమ్ముల జబ్బు ప్రారంభమయింది. దానికి కారణం ఇదా? అనుకున్నాడు.

''సార్! నాకు ఆఫీసుకెళితే చాలు ఈ దుమ్ముతో

సహవాసం. దీనికి దూరంగా వుండడం కష్టమే'' అన్నాడు.


'ఏమిటీ మీరింతకూ చేసే ఉద్యోగం?'' అన్నాడు డాక్టర్.

తను పనిచేసే ఆఫీసు పేరు చెప్పి ''రికార్డు గుమస్తాని. పెండింగు ఫైళ్ళు పదిలపరిచే ఉద్యోగం. ఈ మధ్యనే ఫైళ్ళ క్లియరెన్స్ కార్యక్రమం మొదలయింది. పాత ఫైళ్ళన్నీ వెలికి తీయాల్సి వస్తోంది. ప్రతీ అరగంటకూ స్టోరురూముకెళ్ళాలి. అలా రెండునెలలనుంచీ దుమ్ముతోనే నా సహవాసం. ఫలితంగా ఈ పరిణామం'' అన్నాడు తుమ్ముతూ చిదంబరం.

వెంటనే డాక్టరన్నాడు.

''ఆ సీటు మారండి'' అని.

ఆ మాటలు చిదంబరానికి ఆశనిపాతంలా తగిలాయి. దానికి కారణం తన సీటుకు వస్తున్న అదనపు సంపాదన. ఫైలుతీసి ఆఫీసరుగారి టేబుల్ మీద వుంచితే పార్టీలు తృణమో, పణమో సమర్పిస్తారు. పైగా ఈ ఫైళ్ళ క్లియరెన్సులో సీటు వదిలితే సాక్షాత్తూ లక్ష్మిని పోగొట్టుకున్నట్టే...అయ్యో అనుకుని ఆలోచనలో పడ్డాడు. ''మీరు మందులు వాడితే తుమ్ములు తగ్గుతాయి. తిరిగి దుమ్ము, ధూళికి చేరువయితే మళ్ళీ మామూలే.''



డాక్టర్ హెచ్చరికతో ఆలోచనల్లోంచి బైటకొచ్చి సీటు మారాలనే స్థిర నిర్ణయంతో క్లినిక్‌లోంచి బయటకు నడిచాడు చిదంబరం.

● ● ●

తరువాతి రోజు చిదంబరం ఆఫీసరుగారికి మొరపెట్టుకున్నాడు తన సీటు మార్చమని. ఆఫీసరు వెంటనే ఒప్పేసుకున్నారు అతడి అభ్యర్థన. ఆ సీటుకోసం పోటీపడుతున్న ఏకాంబరాన్ని ఆ సీటు వరించింది. చిదంబరం హాయిగా ఊపిరి పీల్చుకున్నారు.

● ● ●

ఆఫీసులో డిస్పాచి సెక్షనులో పని చేసుకుంటున్న చిదంబరం తనకెదురుగా ఇద్దరు వ్యక్తులు వచ్చి నించోవడంతో తలెత్తాడు. ఒకాయన సూటేసుకుని వున్నాడు. రెండోవ్యక్తి టై కట్టుకుని చేతిలో పెద్దసైజు బౌండు పుస్తకం భారంగా మోస్తూ కనబడ్డాడు. ఇద్దరి వంకా ప్రశ్నార్థకంగా చూసాడు చిదంబరం.

టై కట్టుకున్న వ్యక్తి తుమ్మాడు. సూటాయన మరో తుమ్ము తుమ్మాడు. ఇద్దరు వరుసగా తుమ్మిన తర్వాత టై వ్యక్తి చెప్పాడు.

''మేం తుమ్మూస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు నుంచి వచ్చాం. ఇదివరకూ ఎక్కువ తుమ్ములు తుమ్మి మా రికార్డులోకి అంటే ఈ బుక్‌లోకి ఎక్కినవాళ్ళని మీరు అధిగమించారని తెల్సింది.''

''మీ రికార్డును మా బుక్‌లోకి ఎక్కిద్దామని వచ్చాం. మీరు తుమ్ముతూ ఉండండి. మేం టేప్ చేస్తాం'' అంటూ జేబులోంచి పాకెటు సైజు టేపు రికార్డరు బైటకు తీసాడు.

ఆ మాటలకు చిదరంబరం ఫకాలుమని నవ్వాడు.

''బాబూ! నేను తుమ్మలేను, నాకు తుమ్ములిక రావు. ఆ రికార్డు రూములో ఫైళ్ళు వెదుకుతున్నాడు ఏకాంబరం. ఆయన దగ్గర ప్రయత్నించండి'' అన్నాడు తన నవ్వు కొనసాగిస్తూ చిదంబరం.

వాళ్ళిద్దరూ రికార్డు రూము వైపు చూసారు. వ్యక్తి కనబడకపోయినా ఆ గదినుంచి తుమ్ముల శబ్దాలు వినిపించసాగాయి. చిదంబరం నవ్వుతూనే వున్నాడు.

''ఏమిటీ అలా నవ్వుతున్నారు? బారెడు పొద్దెక్కినా ఇంకా కలలు కంటూ నిద్రపోతున్నారా? ఆఫీసుకువెళ్లరా?'' భార్య మాటలతో నిద్రలోంచి మేల్కొన్న చిదంబరం ''మైగాడ్ ఇదంతా కలా?'' సీటు మారిన తరువాత సుఖంగా నిద్రపోయిన రాత్రి వచ్చిన కల...అనుకుని ఆనందపడ్డాడు. ఇంతలో ఎవరో తుమ్ముతున్న శబ్దం వినిపించి కిటికీలోంచి చూసాడు.

తన సీటు కొట్టేసిన ఏకాంబరం కూర్చున్నాడు డ్రాయింగ్ రూములో. 'ఇంత పొద్దునే ఈ వ్యక్తి ఎందుకొచ్చాడో?' అంటూ చిదంబరం ఆలోచనల్లో పడ్డాడు. భార్య లోపలికొచ్చింది. అతడితో మెల్లగా అంది.

''ఆయన సీటు మారిపోతాడట. నా సీటు నాకిచ్చెయ్యమనండి. నేనే ఆయనకు ఎదురు డబ్బులిస్తాను అంటున్నాడు.'' ఆ మాటలకు ''భలే మంచి చౌకబేరము'' అని పాడుకుంటూ రాని తుమ్ముల్ని ప్రాక్టీసు చేస్తూ హుషారుగా నడిచాడు చిదంబరం ఆ గదిలోంచి పక్క గదిలో.

''ఎలుక తోలు తెచ్చి ఏడాది ఉతికినా నలుపు నలుపేగానీ తెలుపుకాదు'' అంటూ అతడి ఏడేళ్ళ కొడుకు పద్యం చదువుతున్నాడు.

★